నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 19 నవంబర్ 2024 | NIZAMABAD

అభ్యర్థుల జీవితాలతో సర్కారు చెలగాటం



## హోల్డ్‌లో పెట్టారు..

ఖలీల్‌వాడి: డీఎస్సీ 2024లో నేను స్పోర్ట్స్ కోటాలో ఎస్‌జీటీ (తెలుగు)గా ఎంపికయ్యా. హైదరాబాద్‌కు తీసుకెళ్లి అపాయింట్‌మెంట్ ఆర్డర్ కూడా ఇచ్చారు. కానీ పోస్టింగ్ ఇవ్వలేదు. పోస్టింగ్ కోసం డీఈవో ఆఫీసు చుట్టూ తిరుతుంటే హోల్డ్‌లో పెట్టారని సమాధానమిచ్చారు. ఎందుకు అలా అని ప్రశ్నిస్తే సాంకేతిక లోపమని చెప్పారు. ఉద్యోగం వచ్చిందన్న సంతోషం కూడా లేకుండా పోతున్నది. ఇప్పుడేమో ఈ నెల 20 నుంచి జరిగే రీ వెరిఫికేషన్‌కు రమ్మని చెబుతున్నారు. అపాయింట్ మెంట్ ఇచ్చాక ఇలా ఎందుకు చేస్తున్నారో అర్థమైతలేదు.

**- ఉడుత నవత, నిజామాబాద్**



**ఇటీవల నియమితులైన** టీచర్ల జాబ్‌లకు గ్యారంటీ లేకుండా పోయింది. కలల కొలువు సాధించామన్న సంతోషంలో ఉన్న అభ్యర్థులకు సర్కారు ఊహించని షాక్ ఇస్తున్నది. డీఎస్సీలో ఎంపికై ఉద్యోగాలు చేస్తున్న కొందరిని ప్రభుత్వం అకారణంగా తొలగిస్తున్నది. మూడు వారాలుగా పాఠాలు బోధిస్తున్న టీచర్లను సాంకేతిక కారణాలు చూపి టర్మినేట్ చేస్తున్నది. జాబ్ వచ్చిందన్న సంతోషం కొన్నాళ్లు కూడా లేకుండా చేస్తున్నది. ప్రభుత్వ అసంబద్ధ వైఖరితో అభ్యర్థులు కుమిలి పోతున్నారు. ఉద్యోగం వచ్చిందని అందరికీ చెప్పుకున్నామని, ఇప్పుడిలా అర్ధాంతరంగా తొలగించడంతో తామేదో తప్పు చేశామన్న భావన అందరిలో కలుగుతుందని వాపోతున్నారు. సాంకేతిక కారణాలు చెప్పి ఇలా రోడ్డున పడేస్తే తమకు చావే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– నిజామాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

### ఉద్యోగాలు ఇచ్చినట్లే ఇచ్చి..

యువత జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతున్నది. ఉద్యోగాలు ఇచ్చినట్లే ఇచ్చి రద్దు చేస్తూ అభ్యర్థులను తీవ్ర మానసిక వేదనకు గురి చేస్తున్నది. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు అపాయింట్‌మెంట్లు, పోస్టింగ్‌లు ఇచ్చాక, ఇప్పుడేమో తొలగిస్తున్నది. నిజామాబాద్ జిల్లా విద్యాశాఖలోని కొంతమంది అధికారుల తీరు వల్లే ఈ గందరగోళం చోటు చేసుకున్నది. కొందరి నిర్లక్ష్యం మూలంగా ఉద్యోగాలు వచ్చినట్లే వచ్చి కోల్పోయిన ఆడబిడ్డలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. వారి జీవితాలతో విద్యా శాఖ చెలగాటం ఆడడంతో సమాజంలో చిన్నచూపునకు లోనవుతున్నారు. సాంకేతిక కారణాలను బూచీగా చూపి ఉద్యోగాలు రద్దు చేయడం పక్కన పెడితే... అర్హత లేనప్పుడు సదరు అభ్యర్థుల పేర్లు నియామక జాబితాలోకి ఎలా వచ్చాయన్నది ఇప్పుడు దుమారం రేపుతున్నది. సులువుగా సాంకేతిక తప్పిదంతో విద్యా శాఖ తప్పించుకుంటున్నప్పటికీ, తప్పిదాలు చేసిన అధికారులపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదన్నది అంతులేని ప్రశ్నగా మారింది. ఉద్యోగాలిచ్చి వారితో రోజుల పాటు పని చేయించుకుని ఉన్న పళంగా రోడ్డున పడేయడం ద్వారా నిజామాబాద్ జిల్లా యంత్రాంగం పనితీరు ఏ పాటిదో మరోసారి రుజువైంది.

### అన్నీ తప్పులే..

డీఎస్సీ 2024 ఫలితాలు సెప్టెంబర్ 30న విడుదలయ్యాయి. అక్టోబర్ 9న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో నియామక పత్రాలను అందించారు. ప్రభుత్వ ఆదేశాలతో నిజామాబాద్ జిల్లా విద్యా శాఖ అధికారులు 640 పోస్టులకు గాను 452 మందిని ఎంపిక చేసి జాబితాను ప్రభుత్వానికి సమర్పించారు. మిగిలిన 88 పోస్టులను భర్తీ చేయలేదు. ఇందుకు సవాలక్ష కారణాలను చూపించారు. కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో కృష్ణ చైతన్యకు సోషల్ సబ్జెక్ట్‌లో దివ్యాంగుల కోటాలో 780 ర్యాంక్ వచ్చింది. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కాగా, అతడ్ని వెరిఫికేషన్‌లో పక్కనపెట్టి ఆయన కన్నా ఎక్కువ ర్యాంకు వచ్చిన వ్యక్తికి ఉద్యోగం ఇచ్చారు. దాదాపు వందకు పైగా ర్యాంకుల మధ్య తేడా ఉన్న మరో వ్యక్తికి ఉద్యోగం ఇవ్వడం తీవ్ర దుమారం రేపింది. తమ తప్పిదాలను కప్పి పుచ్చుకునే క్రమంలో దివ్యాంగ కోటాలో అర్హత సంపాదించిన కృష్ణ చైతన్యపైనే విద్యాశాఖ బాధ్యులు నిందలు మోపారు. వెరిఫికేషన్‌కు రాలేదంటూ బుకాయించారు. తీరా సీన్ కట్ చేస్తే పరిశీలన అనంతరం తిరిగి 780 ర్యాంక్ వచ్చిన కృష్ణ చైతన్యకు ఇప్పుడు జాబ్ వచ్చింది.

- సతీష్ అనే మరో దివ్యాంగుడికి సైతం ఇదే రీతిలో హిందీ కోర్సు విషయంలో కొర్రీలు పెట్టి మొదట ఉద్యోగం ఇవ్వలేదు. న్యాయ పోరాటం చేయడంతో చివరికి ఉద్యోగం దక్కింది. సెప్టెంబర్‌లో బీఈడీ పూర్తి చేసిన వారంతా ఉపాధ్యాయ పోస్టుకు అర్హులే. ఈ కనీస అర్హతను కూడా గుర్తించని అధికారులు ఏకంగా స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైన ప్రవీణ్ అనే యువకుడ్ని పక్కన పెట్టి ఆ తర్వాత పొరపాటును గుర్తించి ఉద్యోగం ఇచ్చారు.
- ఉట్నూర్ లావణ్యకు ఎస్జీటీ (తెలుగు) ఉద్యోగం వరించింది. ధర్పల్లి మండలంలోని దుబ్బాకలో పోస్టింగ్ కూడా ఇచ్చారు. ఆమె మూడు వారాల పాటు విద్యార్థులకు పాఠాలు కూడా బోధించింది. అయితే, సాంకేతిక కారణాలను చూపి తాజాగా ఆమె ఉద్యోగాన్ని రద్దు చేశారు.
- నిజామాబాద్‌కు చెందిన ఉడుత నవతకు స్థానిక సంస్థల విభాగంలో ఎస్‌జీటీగా ఉద్యోగం వచ్చింది. హైదరాబాద్‌లో నియామక పత్రాన్ని అందుకున్నారు. ఏమైందో ఏమో ఆమె ఉద్యోగాన్ని హోల్డ్‌లో పెట్టారు .

# అటు పోస్టింగ్.. ఇటు ఊస్టింగ్

- డీఎస్సీలో ఎంపికైన పలువురు ఉపాధ్యాయులు
- అపాయింట్‌మెంట్లు అందజేత..
- పలు పాఠశాలల్లో అభ్యర్థులకు పోస్టింగ్‌లు
- మూడు వారాల పాటు పాఠాలు చెప్పిన టీచర్లు
- ఇప్పుడేమో సాంకేతిక కారణాలంటూ తొలగింపు
- రోడ్డున పడుతున్న అమాయకులు
- వివాదాస్పదంగా మారిన జిల్లా విద్యాశాఖ తీరు




అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీని అందుకుంటున్న ఉట్నూర్ లావణ్య (ఫైల్)

### ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లు..

నిజామాబాద్ విద్యాశాఖ పేరు చెబితేనే చీదరించుకునే పరిస్థితికి దిగజారింది. అడుగడుగునా అవినీతి, అక్రమాలకు నిలయంగా గత అధికారి మార్చేశారన్న అపవాదు ఉంది. కొంత మంది యూనియన్ లీడర్లకు ఊడిగం చేయడం, సామాన్య టీచర్లను వేధించారన్న ఆరోపణలు అనేకం ఉన్నాయి. తనిఖీలపేరుతో కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ స్కూళ్లలో హల్‌చల్ చేయడం ఆయనకే చెల్లింది. తనిఖీలకు వెళ్లినప్పుడల్లా లోపాలను గుర్తించి సరి చేయకుండా సస్పెన్షన్, మెమోల జారీ పేరిట బేరాలు కుదుర్చుకున్న దాఖలాలు సైతం ఉన్నాయి. అలాంటి అధికారి హయాంలోనే ఉద్యోగాల భర్తీలోనూ గందరగోళం చోటు చేసుకున్నది. డీఎస్సీ 2024 ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో చోటు చేసుకున్న పరిణామాలు అనేక అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. వెరిఫికేషన్ అధికారులు తెలిసే తప్పులు చేశారా? లేదంటే పొరపాటున ఈ తప్పిదాలు చోటు చేసుకున్నాయా? అన్నది అనుమానాస్పదంగా మారింది. ఉద్యోగాల భర్తీ కోసం చేపట్టే అర్హత పరీక్షనే ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహిస్తుంది. పరీక్షకు హాజరయ్యే లక్షలాది మందిపై నిఘా పెడుతుంది. అలాంటిది ఉద్యోగాల ఎంపిక చివరి ప్రక్రియలో ఇంత ఘోరమైన తప్పిదాలు చోటు చేసుకోవడం కచ్చితంగా ప్రభుత్వ వైఫల్యమే. డీఎస్సీ భర్తీ ప్రక్రియలో చోటు చేసుకున్న ఈ అయోమయానికి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు కోరుతున్నారు. అవసరమైతే లోతుగా విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### జీవితాలతో ఆడుకుంటుండ్రు



ధర్పల్లి: మొన్నటి డీఎస్సీలో ఎస్జీటీగా సెలక్ట్ అయిన. హైదరాబాద్‌లో అపాయింట్‌మెంట్ కూడా ఇచ్చిండ్రు. ధర్పల్లి మండలంలోని దుబ్బాక ఒడ్డెర కాలనీలో గల ప్రాథమిక పాఠశాలలో పోస్టింగ్ ఇచ్చిండ్రు. జాబ్ వచ్చిందని కుటుంబ సభ్యులకు, బంధువులందరికీ చెప్పుకున్నా. సెప్టెంబర్ 16న జాబ్‌లో చేరా. ఏడాదిన్నర బాబును ఎత్తుకుని దుబ్బాక నుంచి ఒడ్డెర కాలనీకి రోజూ నడుచుకుంటూ వెళ్లి పిల్లలకు పాఠాలు చెప్పా. ఏం జరిగిందో ఏమో కానీ టెక్నికల్ ఇష్యూ వల్ల నిన్ను ఉద్యోగంలోంచి తీసేస్తున్నామని కాంప్లెక్స్ హెచ్ఎం జ్యోతిరాణి మేడం నా చేతిలో టర్మినేషన్ లెటర్‌ను పెట్టింది. అది చూసి నా ప్రాణం పోయినంత పనైంది. టెక్నికల్ ఇష్యూ అని ఈజీగా చెప్పేసి చేతులు దులుపుకుంటున్నారు. మా పరిస్థితి ఏమిటో ఒక్కసారి ఆలోచించండి. మాది పేద కుటుంబం. ఎంతో కష్టపడి బీఈడీ చదివి, డీఎస్సీ రాసి ఉద్యోగం సాధించా. 23 రోజులు డ్యూటీ కూడా చేశా. అలాంటిది ఇప్పుడు రోడ్డున పడేస్తే ఏం చేయాలి? డీఎస్సీ అయ్యాక నాకు జాబ్ రాకుంటే రాలేదని ఊరుకునే దాన్ని. జాబ్ వచ్చి డ్యూటీలో చేరాక ఇప్పుడు తొలగిస్తే ఎట్ల? తెలిసిన వాళ్లేమో నువ్ ఏదో తప్పుచేశావు అందుకే తీసేశారని అంటుంటే చచ్చిపోవాలనిపిస్తుంది. అధికారులు ఎందుకిలా నా జీవితంతో ఆడుకుంటున్నారో అర్థమైతలేదు. చేయని తప్పుకు ఎందుకు శిక్ష? అధికారులు నాకు ఉద్యోగమైనా ఇప్పించాలి లేదా నాకు చావైనా ప్రసాదించాలి.

**- ఉట్నూర్ లావణ్య, అమ్రాద్ గ్రామం, మాక్లూర్ మండలం**






## టైం పాస్ కోసమే కులగణన సర్వే

**ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్**



తన ఇంటికి సర్వేకు వచ్చిన ఎన్యుమరేటర్‌కు గతంలో సర్వేపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వినిపిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి, నవంబర్ 18: కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో టైం పాస్ కోసమే సర్వే చేస్తున్నదని ఆర్టీసీ మాజీ చైర్మన్, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. సర్వేలో భాగంగా సోమవారం తన ఇంటికి వచ్చిన ఎన్యుమరేటర్లకు ఆయన వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ హయాంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే గురించి రేవంత్‌రెడ్డి అప్పట్లో మాట్లాడిన వీడియోను బాజిరెడ్డి.. ఎన్యుమరేటర్లకు చూపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చేసిన సమగ్ర సర్వేను ఎద్దేవా చేసిన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి.. ఆయన ఎందుకు సర్వే చేస్తున్నాడో ముందుగా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మోసపూరిత మాటలతో, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారని, 11 నెలలైనా పథకాలను అమలు చేయకపోవడం సిగ్గుచేట్టన్నారు. అధికారంలో లేనప్పుడు ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం, ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలతో పాటు రైతులకిచ్చిన రైతుభరోసా నెరవేరేంత వరకు రైతుల పక్షాన పోరాడుతామన్నారు. ప్రజలకు ఉపయోగపడే సమగ్రమైన సర్వే దీంట్లో లేదని, మరోమారు కాంగ్రెస్ ప్రభుత్వం పరీక్షించుకోవాలన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3

**సగం మంది అభ్యర్థులు గైర్హాజరు**



జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ పరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్/ కామారెడ్డి, నవంబర్ 18: ఉమ్మడి జిల్లాలో రెండురోజులుగా నిర్వహించిన గ్రూప్–3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం తనిఖీ చేశారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్షలను నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. నిజామాబాద్‌లో సోమవారం నిర్వహించిన పరీక్షకు మొత్తం 19,941 మంది అభ్యర్థులకు 9,880 (49.54 శాతం) మంది హాజరు కాగా 10,058 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

కామారెడ్డిలోని 20 పరీక్షా కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన పరీక్షకు మొత్తం 8,268 మంది అభ్యర్థులకు 4,612 మంది (55.78 శాతం) హాజరు కాగా 3,656 మంది గైర్హాజరయ్యారని రీజినల్ కో–ఆర్డినేటర్ విజయ్ కుమార్ వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## రూ.1.05 కోట్ల విలువైన మత్తు పదార్థాల దహనం



మత్తు పదార్థాలను కాల్చివేయిస్తున్న పోలీసు అధికారులు

వినాయక్‌నగర్/ జక్రాన్‌పల్లి, నవంబర్ 18 : నిజామాబాద్ జిల్లాలోని పలు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు చేసిన దాడిలో పట్టుబడిన నిషేధిత మత్తుపదార్థాలను అధికారులు సోమవారం దహనం చేశారు. నిజామాబాద్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డి ఆదేశాల మేరకు సూపరింటెండెంట్ కె.మల్లారెడ్డి పర్యవేక్షణలో రూ.1.05 కోట్ల విలువ చేసే మత్తు పదార్థాలను దహనం చేసినట్లు వెల్లడించారు. నిజామాబాద్, భీంగల్, ఆర్మూర్, మోర్తాడ్ ఎక్సైజ్‌స్టేషన్ల పరిధిలో సీజ్ చేసిన 353 కిలోల ఎండు గంజాయి, 1.5 కిలోల డైజోఫామ్, 2.5 కేజీల అల్ప్రాజోలం తదితర మత్తు పదార్థాలను జక్రాన్‌పల్లి మండలం పడ్కల్ గ్రామంలో ఉన్న మెడికేర్ సర్వీసెస్‌లో దహనం చేశారు. ఎస్‌హెచ్‌వోలు స్టీవెన్‌సన్, గుండప్ప, దిలీప్ కుమార్, వేణుమాధవ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్కొండలో వీధికుక్కల స్వైరవిహారం

**ఇద్దరు చిన్నారులపై దాడి..**



కుక్కల దాడిలో గాయపడిన చిన్నారులు

బాల్కొండ, నవంబర్ 18: మండలకేంద్రంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మనిషి కనిపిస్తే చాలూ వెంట పడుతున్నాయి. చిన్నా పెద్దతేడా లేకుండా దాడులు చేసి, తీవ్రంగా గాయపరుస్తున్నాయి. దీంతో బయటికి వెళ్లాలంటేనే గ్రామస్తులు జంకుతున్నారు. తాజాగా సోమవారం ఇంటి బయట ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులపై కుక్కలు దాడి చేశాయి. ముస్కాన్ (9), ఆదిత్య (4) చిన్నారులపై దాడి చేయగా.. గాయపడ్డారు. గమనించిన కుటుంబీకులు వెంటనే దవాఖానకు తరలించి చికిత్స అందించారు. మండల కేంద్రంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తుండడంతో ప్రయాణికులు కూడా ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి మండల కేంద్రంలో కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం



సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

పెద్దకొడప్‌గల్, నవంబర్ 18: సోయా కొనుగోళ్లు చేపట్టకుండా రైతులను ఇబ్బంది పెట్టిన యంత్రాంగం ఎట్టకేలకు పంట కొనుగోళ్లకు ముందుకొచ్చింది. సోయా రైతుల అవస్థలపై 'నమస్తే తెలంగాణ' ఈనెల 10న ప్రచురించిన కథనానికి మార్క్‌ఫెడ్ స్పందించింది. పెద్దకొడప్‌గల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోయా కొనుగోలుకేంద్రాన్ని సోమవారం ప్రారంభించింది. కొనుగోలు కేంద్రాలు లేక, ప్రైవేట్‌లో తక్కువ ధరకు అమ్ముకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలోని ఉద్గీర్ మార్కెట్‌కు సోయాపంటను తరలిస్తున్న అంశాన్ని 'నమస్తే తెలంగాణ' ఎత్తిచూపింది. ఈకథనంపై అదేరోజు స్పందించిన ఉన్నతాధికారులు నివేదిక సమర్పించాలని పెద్దకొడప్‌గల్ సొసైటీ సిబ్బందిని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని గమనించిన ప్రభుత్వం.. ఎట్టకేలకు కొనుగోలు కేందాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీంతోస్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సోమవారం కేంద్రాన్ని ప్రారంభించారు. సోయా కొనుగోలు కేంద్రం ఏర్పాటయ్యేందుకు దోహదపడిన 'నమస్తే తెలంగాణ'కు రైతులు అభినందనలు తెలిపారు. సొసైటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ సంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.




## పతంగి తీసేందుకు వెళ్లి.. అనంతలోకాలకు..



షేక్ మతిన్ (ఫైల్)

- చెట్టుపై ఉన్న గాలిపటం తీసే క్రమంలో హైటెన్షన్ వైర్లు తగిలి అక్కడికక్కడే బాలుడి మృతి
- రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగిన బాధిత కుటుంబం, గ్రామస్తులు

ఎడపల్లి, నవంబర్ 18 : చెట్టుపై ఉన్న గాలిపటాన్ని తీసే క్రమంలో హైటెన్షన్ వైర్లు తగిలి ఓ బాలుడు అక్కడికక్కడే మృతిచెందిన విషాదకర ఘటన ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లిలో సోమవారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుర్నాపల్లి గ్రామానికి చెందిన షేక్ మతిన్ (13) గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఉదయం వీధిలో ఉన్న ఓ చెట్టుపై గాలిపటం ఉండడాన్ని గమనించి, చెట్టుపైకి ఎక్కాడు. గాలిపటం తీసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ హైటెన్షన్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. హైటెన్షన్ వైర్లు చెట్టు కొమ్మలను ఆనుకొని ఉండడం, అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం చోటుచేసుకున్నదని బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న ఎడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. న్యాయం చేస్తామని సముదాయించడంతో ఆందోళన విరమించారు. గాలిపటం కోసం బాలుడు ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



తమకు న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు